సమృద్ధిగా నీరు.. పైపులైన్లే అసలు సమస్య

- వేసవిలో రెండు పూటలా నీరివ్వాలని నిర్ణయం
- మొదలైన రూ 62 కోట్లపైప్‌లైన్ల ప్రక్షాళన



పొన్నపల్లిలో ట్యాంకర్ ద్వారా మంచినీళ్లు పట్టుకుంటున్న దృశ్యం


పట్టణంలో మెయిన్‌రోడ్డులో కోర్టు వద్ద పైప్‌లైన్ లీకైన దృశ్యం(ఫైల్)

నరసాపురం: ప్రస్తుతం క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. రాబోయే వేసవిలో మునిసిపాలిటీ మంచినీటి సరఫరా ఏ విధంగా చేస్తుంది? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. కానీ వేసవిలో కుళాయిల ద్వారా పట్టణ వాసులకు రెండు పూట్లా నీరందించాలని పాలకవర్గం నిర్ణయించింది. కానీ పైప్‌లైన్ల సమస్య వేధిస్తోంది. అయితే వేసవిలో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. మొత్తంగా వేసవికాలం మొత్తం యథావిధిగా రెండుపూట్లా మంచినీరు కుళాయిల ద్వారా సరఫరా చేసే విధంగా నిర్ణయం కూడా తీసుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మంచినీటి సరఫరా విషయంలో నెలకొన్న ఇబ్బందులను ఎలా అధిగమించి, మంచినీటి సరఫరా చేస్తారనేదే అంశంలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. మంచినీటి చెరువులో 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు నాలుగు రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రతీరోజూ 7.8 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. మునిసిపల్ లెక్కల ప్రకారం చూసుకుంటే చెరువులో అందుబాటులో ఉన్న నీటిని కాలువలు కట్టేసిన తరువాత జూన్ మొదటి వారం వరకూ ఏ ఇబ్బంది లేకుండా నిరాటంకంగా రెండు పూటలా సరఫరా చేయొచ్చు. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్స్ శిథిలం కావడం వల్లే వస్తోంది. పైప్‌లైన్లు బాగోలేక పోవడంతో తక్కువ ప్రెజర్‌తో నీటిని వదులుతారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్లు సవ్యంగా రావు. ఒక వేళ ఎక్కువ ప్రెజర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్స్‌కు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజీలు ఏర్పడే పరిస్థితి ఉంది. గత పాలకులు ఈ అంశాన్ని ఎప్పుడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో సమస్య అలాగే ఉండిపోయింది.

లీకేజీల తంటా...

ప్రతీరోజూ ఏదో ఓ ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్లు లీక్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోతుంది. ఈ సమస్య కారణంగా పట్టణ వాసులు మంచినీటికి కటకటలాడుతున్నారు. అందుబాటులో అవసరమైన మేర నీరున్నా కూడా, పైప్‌లైన్స్ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా ప్రజలు గుక్కెడు నీటికోసం కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిచామని అధికారులు చెప్తున్నారు.

మొదలైన పైప్‌లైన్స్ ప్రక్షాళన పనులు

నరసాపు మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటుగా అదనంగా 4 ఓహెచ్ఆర్‌ల నిర్మాణం చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ముందుకు వచ్చింది. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక కృషితో మున్సిపాలిటీలో రూ.61.81 కోట్లతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ మంజూరు చేసింది. ఈ పనులకు గతేడాది నవంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాన చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఓహెచ్ఆర్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్ట్ మంజూరుతో దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఈ వేసవిలో పనులు చురుగ్గా సాగే అవకాశం ఉంది. ఇక భవిష్యత్‌లో పట్టణంలో మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

వేసవిలో నీటి ఎద్దడి రాదు



వేసవిలో మంచినీటి ఎద్దడి రానివ్వం. మనకు నీరు సమృద్ధిగా ఉంది. పైప్‌లైన్ల వల్లే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. చాలా వరకూ సరిచేశాముం ఇటీవల ఎక్కడ సమస్య తలెత్తితే అక్కడ వెంటనే పైప్‌లైన్ల మరమ్మతులు చేస్తున్నాము. వేసవిలో మంచినీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. అవసరమైతే అదనపు ట్యాంకులు పెట్టి అవసరమైన ప్రాంతాలకు నీరు పంపుతాం. సుమారు రూ.62 కోట్లుతో చేపట్టిన స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ పనులు పూర్తయితే రాబోయే 30 ఏళ్ల వరకూ మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవు.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

జగనన్న కాలనీలో గృహప్రవేశం


గృహ ప్రవేశంలో పాల్గొన్న నాయకులు

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర గ్రామానికి చెందిన గుబ్బల నవీన్ తన సొంత ఇంటి కలను నెరవేర్చుకున్నాడు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో సొంత ఇంటిని నిర్మించుకోవడంతో శనివారం గృహ ప్రవేశం చేశాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కవురు సుబ్రమణ్యం, జక్కంశెట్టి ఏడుకొండలు, దొంగ నాగముని, కవురు ఆదినారాయణ తదితరులు పాల్గొని గుబ్బల నవీన్ దంపతులను ఆశీర్వదించారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు


పెనుగొండలో పంట కాలువలోకి దూసుకుపోయిన కారు

పెనుగొండ: పెనుగొండ మార్కెట్ యార్డు వద్ద ఇన్నోవా కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకొన్నారు. శనివారం తెల్లవారు జామున తూర్పుగోదావరి జిల్లా నుంచి నరసాపురం వైపు ప్రయాణిస్తుండగా అదుపు తప్పడంతో పంట కాలువలోకి దూసుకువెళ్లింది. కారుల్లో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

చెట్టుకూలి వ్యక్తికి గాయాలు

పెనుగొండ: మండలంలోని ములపర్రులో కొబ్బరి చెట్టు కూలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం ములపర్రు శివారు పితానివారిపాలేనికి చెందిన గుత్తుల శ్రీనివాసరావు పాలు తీసుకొని పాలకేంద్రానికి వెళ్లి తిరిగి సైకిల్‌పై వస్తుండగా ఒక్కసారిగా కొబ్బరి చెట్టు విరిగి పడింది. దీంతో తలకు, నడుముకు గాయాలు అయ్యాయి. స్థానికులు సత్వరం 108కి సమాచారం అందించడంతో తణుకు ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

పెనుమంట్ర: మండలంలో ని జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవం, తీర్థ జాతర మహోత్సవం ఆదివారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారికి నిత్యార్చనలు నిర్వహించి, ఖమ్మం జిల్లా కొత్తగూడెం భజన సమాజం వారితో పోతురాజు వారిని ఊరేగింపుగా పొలాల్లో ఉన్న అమ్మవారి ఆలయం వద్దకు బోనాల సంబరంతో దేవాలయానికి తీసుకువెళ్లారు. సర్పంచ్ తమనంపూడి వీరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో 150 మంది మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామ పొలాల్లో ఉన్న అమ్మవారి గుడి వద్దకు పోతురాజుని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆదివారం ఆలయం వద్ద తీర్థ మహోత్సవంతో పాటు అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు మావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

యోగ శ్రీకృష్ణుని అలంకరణ



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని శనివారం యోగ ముద్రలో కూర్చుని ఉన్న శ్రీ కృష్ణునిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

15న ఇంటర్ అర్హత పరీక్షలు

పెనుగొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు హాజరు కావడానికి నిర్వహించే పరీక్షలు ప్రథమ సంవత్సర, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 15న నైతికత–మానవ విలువలు, 17న పర్యావరణ విద్యపై నిర్వహించనున్నట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 15వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర, 16వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయని వివరించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 26వ తేదీ నుంచి మార్చి 7 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తప్పని సరిగా పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

నరసాపురం రూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలి? అనే అంశం సచివాలయ వలంటీర్లు, వీఆర్వోలు, ఆపద మిత్రలకు శనివారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం, మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం వరదలు, అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలినప్పుడు , ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. ఎస్‌డీఆర్ఎఫ్ ఇచ్చిన శిక్షణను గురించి ప్రజా తహశీల్దార్ ఫాజిల్ ప్రశంసించారు. ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వై సత్యనారాయణ విపత్తులు ఏర్పడిన సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ పథకాలు


పోడూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇంటింటికీ పర్యటించారు. గడిచిన 3 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సంక్షేమపథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో? ఆయన ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వంలటరీ, సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా, పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, ఎంపీటీసీ సభ్యులు పోడూరి నాగరాజారావు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, గ్రామకమిటీ అధ్యక్షుడు పాలా ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం


పాలకొల్లులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి ఉషాలక్ష్మీకుమారి


నరసాపురంలో జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: జాతీయ లోక్ అదాలత్‌లో 528 కేసులు పరిష్కారమైనట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో రెండు బెంచీల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఒక బెంచ్‌లో జడ్జి ఉషా లక్ష్మీకుమారి, రెండవ బెంచ్‌లో జడ్జి భానుసాయిలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఉషా లక్ష్మీకుమారి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 528 కేసులు పరిష్కారం అవ్వగా కక్షిదారులకు రూ.44,92,963 నగదు అందించామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మంగ తాయారు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: జాతీయలోక్ అదాలత్‌లో కోటి 72 లక్షల 56 వేల రూపాయల విలువైన 742 కేసులు రాజీ అయినట్లు పదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయ దుర్గ పేర్కొన్నారు. నరసాపురం మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 6 సివిల్ కేసులు, 81 క్రిమినల్ కేసులు, 31 ప్రీలిటిగేషన్ కేసులు, 624 బెంచ్‌కోర్టు అడ్మిషన్ కేసులు వెరసి మొత్తం 742 కేసులు రాజీ అయ్యాయని వాటి విలువ రూ.1,72,56,000 ఉంటుందని జడ్జి వివరించారు. బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బకాయిల కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, బెంచ్‌కోర్టు న్యాయమూర్తి ఉషారాణి, న్యాయవాదులు స్వామినాయుడు, పి.వెంకన్ననాయుడు, ఆర్.జెస్సీకళ, గన్నాబత్తుల శివాజీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం


చించినాడలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు

యలమంచిలి: రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మనదని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. చించినాడ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గమనించి జగనన్నకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, ఉప సర్పంచ్ రుద్రరాజు బలరామకృష్ణంరాజు (చిన్న) పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదునూరి లక్ష్మీపతిరాజు, హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, నాయకులు విప్పర్తి నవీన్, ముదునూరి రంగరాజు, కఠారి నారాయణస్వామి, బండారు అరుణాదేవి, రేపూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివమూర్తికి సత్కారం


జేసీఐ ఆధ్వర్యంలో సదాశివమూర్తి దంపతులకు సత్కారిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: అవయవాలు పోగొట్టుకున్న కృత్రిమ అవయవాలతో మన పని మనం చేసుకోవచ్చని మనోధైర్యాన్ని కల్పించిన వేదాంతం సదాశివ మూర్తికి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు రావడం అభినందనీయమని పాలకొల్లు రైజింగ్ సంస్థ జెసిఐ అధ్యక్షురాలు డాక్టర్ కావలి మౌని అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జేసిఐ ఆధ్వర్యంలో సదాశివమూర్తి, సత్య స్వరాజ్య సుందరి దంపతులకు అభినందన సత్కార సభ ఏర్పాటుచేశారు. మౌని మాట్లాడుతూ సదాశివమూర్తి సేవలకు గాను ప్రైడ్ ఆఫ్ ఇండియా మరియు కామన్వెల్త్ యూనివర్శిటీ కింగ్డాంగ్ ఆఫ్ టోంగా ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో పీహెచ్‌డీ పట్టా అందుకోవడం పాలకొల్లుకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు, మాజీ ప్రిన్సిపాల్ సీవీవీ సత్యనారాయణమూర్తి, చేగొండి సూరిబాబు, బోణం రాంబాబు, కారుమూరి శ్రీరాములు, చల్లా ఉమాశర్మ, చల్లా మాదుర్, జేసిఐ సభ్యులు గంటా అనూష, కారుమూరి సభిత, రాహుల్, మనోజ్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

పెనుగొండ: పెనుమంచిలి రామాలయంలో ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఖండవల్లి సూర్యనారాయణా చార్యులు ఆధ్వర్యంలో పూజలు అభిషేకాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 45 అడుగుల ధ్వజ స్తంభాన్ని భారీక్రేన్‌తో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేషుల శేషవేణి, మాజీ సర్పంచ్ కడియాల పేరీశం(పుల్లాజీ), దేవస్థానం చైర్‌పర్సన్ దేవిరెడ్డి లక్ష్మీ కల్యాణి, దేవిరెడ్డి రాంబాబు, గణేషుల పెద్దిరాజు, ఆలపాటి ధనలక్ష్మీ, భీమనాథం అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

పెనుగొండ: నాణ్యమైన విలువలు కలిగిన విద్యనందించడమే లక్ష్యమని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. శనివారం కళాశాలలో పలు విశ్వ విద్యాలయాలు, కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులతో నిర్వహించిన బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే తొలి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామని ఆయన గుర్తు చేశారు. కళాశాలలో విలువైన, నాణ్యమైన విద్యనందించడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అటానమస్ కంట్రోలర్ జి శ్రీధర్, అసిస్టెంట్ కంట్రోలర్ దుర్గాప్రసాద్, రమేష్, ఫణికృష్ణ పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత


తోపుడు బండి అందజేస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ అంటేనే సేవా కార్యక్రమాలకు నిలయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. శనివారం స్థానిక 25వ వార్డులో జీవనోపాది నిమిత్తం ఓ వ్యక్తికి తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ స్థానిక అల్లువారి వీధికి చెందిన కండిపల్లి చిన్నకు సుమారు వంద వరకూ రిక్షాలు ఉండేవని వాటిని అద్దెలకు ఇచ్చి జీవనోపాధి పొందేవాడని అన్నారు. కొంతకాలం క్రితం ఆర్థికంగా ఇబ్బందులు పడడం వల్ల ఆ రిక్షాలను అమ్మి ఇబ్బందులు తీర్చుకున్నారన్నారు. ప్రస్తుతం తన కుమారుడు కుమార్ స్వయంగా వ్యాపారం చేసుకోవాలంటే కనీసం తోపుడు బండి కూడా లేదని తనకు తెలియపరచడంతో అతని జీవనోపాధి నిమిత్తం బండిని అందజేశానన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చోడదాశి అశోక్, వైఎస్సార్‌సిపి నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డికాసులు, మండెల ప్రసాద్, హరిగోపాల్, అల్లు సతీష్, పాలపర్తి కృపానాథ్, షేక్ వల్లీ, పెచ్చెట్టి కృష్ణాజి, తలువూరి భుజంగరావు, అంజుర్తి శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణంలోని 8వవార్డులో జనరల్ ఫండ్స్ రూ 12.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులకు జనరల్ ఫండ్స్ పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. ఆమె వెంట కౌన్సిలర్ కావాలి నాని, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.